## భద్రాద్రి రామయ్యకు ప్రత్యేక పూజలు


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, జూన్ 7 : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారి ఉత్సవమూర్తులకు శనివారం స్వర్ణ తులసి పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు.

## అంతర్గత సామర్థ్యానికి పదును పెట్టేందుకు సమ్మర్ క్యాంపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం టౌన్, జూన్ 7 : విద్యార్థులకు కొత్తగూడెంలో గత 36రోజులుగా జరుగుతున్న సమ్మర్ క్యాంపు శుక్రవారం ముగిసింది. ముగింపు వేడుకల్లో కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతోపాటు టీపీసీసీ సభ్యుడు నాగ సీతారాములు పాల్గొన్నారు. గతంలో 14 క్యాంపులు ఉండగా ప్రస్తుతం 33 క్యాంపులు ఏర్పాటు చేసి విద్యతో పాటుగా క్రీడల్లోనూ విద్యార్థులకు ఆసక్తిని పెంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో పరంధామరెడ్డి, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, సాబీర్‌పాషా, కాశీ హుస్సేన్ పాల్గొన్నారు.

## కార్మికులకు వైద్యసేవలు అందించాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మణుగూరు టౌన్, జూన్ 7 : సింగరేణివ్యాప్తంగా ఉన్న కంపెనీ ఆస్పత్రుల్లో కార్మికులకు సరైన వైద్యసేవలు అందించాలని ఏఐటీయసీ నాయకులు కోరారు. శనివారం మణుగూరు డీవైసీఎంవో జ్యోతిర్మయిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు రాంగోపాల్, పుల్లారావు, ఆవుల నాగరాజు, శ్రీనివాసరావు, సురేందర్, రవికుమార్, సాయి ప్రకాష్ చారి, పద్మావతి పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న అన్నవరపు కనకయ్య

ములకలపల్లి, జూన్ 7 : గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని వేముకుంట గ్రామంలో గౌరీ నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం కుంటుపడిందని, గ్రామాలు అభివృద్ధికి నోచుకోక వెలవెలబోతున్నాయన్నారు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా గ్రామీణ ప్రాంతాల పరిస్థితి తయారైందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలు అనేక సంవత్సరాలు క్రితం పోడు భూములను వ్యవసాయం చేస్తున్న పోడు రైతులకు హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిగొండ రాంబాబు, పోడియం వెంకటేశ్వర్లు, రావుజా, ఊకంటి రవికుమార్, మధు, అమల, కుంజా రాంమూర్తి, బుగ్గ వెంకట నర్సమ్మ, గుగులోత్ దేవేందర్ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

★Staff for reputed Homeopathy Clinic, Khammam. Homeopathy Doctors (BHMS/MD) -2, Receptionist (any Degree)-2, Manager-1, Cont: 9502755595
KMM-

★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం

FINANCE

★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ



నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# భక్తిశ్రద్ధలతో బక్రీద్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా శనివారం బక్రీద్ పర్వదిన వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి చిన్నాపెద్ద తేడాలేకుండా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా వద్ద నిరుపేదలకు తమ సంప్రదాయమైన ఖుర్బా నీని ఎవరికి తోచిన విధంగా ధనం, వస్తురూపంలో అందజేశారు.

\- నమస్తే నెట్‌వర్క్


రామవరం : కార్మికవాడలో...


బూర్గంపహాడ్ : గొమ్మూరు ఈద్గా వద్ద..


దమ్మపేట ఈద్గా వద్ద..


భద్రాచలం : ఈద్గా వద్ద...

# అభివృద్ధి వైపు ప్రణాళికాబద్ధంగా అడుగులు

- మౌలిక వసతులు, ప్రజా సంక్షేమానికి పెద్దపీట
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ, జూన్ 7 : కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. శనివారం పాల్వంచలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుతో పాల్వంచ గిరిజన చట్టాలకు ఎటువంటి ముప్పు ఉండబోదని, పాల్వంచ ఐడెంటిటీని కాపాడే బాధ్యత తనదని అన్నారు. విద్యారంగం కోసం రూ.223.42 కోట్లు నిధులు మంజూరయ్యాయని, 47.87 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. ఆర్అండ్‌బీ రోడ్డు కోసం రూ.652 కోట్లు మంజూరయ్యాయని, మున్సిపాలిటీలో పాల్వంచ మున్సిపాలిటీకి రూ.12+10 కోట్లు, కొత్తగూడెం మున్సిపాలిటీకి రూ.18 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు., సమావేశంలో సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, ఉప్పశెట్టి రాహుల్, నాగరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి

**ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో ఘటన**

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జూన్ 7 : భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో శనివారం చోటు చేసుకుంది. బీజాపూర్ జిల్లా నేషనల్ పార్కు ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు భద్రతా దళాలు సెర్చింగ్ ఆపరేషన్ ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో జవాన్లను గుర్తించిన మావోయిస్టులు వెంటనే కాల్పులకు దిగారు. దీంతో జవాన్లు సైతం కాల్పులు ప్రారంభించడంతో ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అటవీ మార్గం గుండా పారిపోయారు. అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఘటనా స్థలంలో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందగా.. అందులో ఇద్దరు మహిళలు ఉన్నట్లు బీజాపూర్ జిల్లా పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఐదుగురి మృతదేహాలతోపాటు రెండు ఏకే-47 గన్‌లు, ఇతర ఆయుధ, వస్తు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో కొందరు జవాన్లు సైతం పాముకాటుకు గురికావడం, కందిరీగల బారినడిపడడం, డీహైడ్రేషన్‌తో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని పోలీస్ ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

## పాస్టర్లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి


నూతన కమిటీ సభ్యులు

టేకులపల్లి, జూన్ 7 : పాస్టర్లకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని టేకులపల్లి మండల పాస్టర్ల సంఘం నూతన అధ్యక్షుడు రాజు రాంచందర్ అన్నారు. శనివారం టేకులపల్లి మండలం బోడు కొత్తూరు గ్రామంలో జరిగిన మండల పాస్టర్ల ఫెలోషిప్ సమావేశం పుష్పరాజ్ చర్చిలో జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా రాజు రాంచందర్, ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ తవుడోజు బోయాజ్, ఉప అధ్యక్షుడుగా ఉండం నరేష్, సభ్యులుగా మార్కు, తిమోతి, అబ్రహం, దావీదులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజురాంచందర్ మాట్లాడుతూ మండలంలో పాస్టర్ల సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రభుత్వ పథకాలు ఇందిరమ్మ ఇల్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పాస్టర్ జాన్‌రాజ్, దయాకర్, మార్కు, పిల్లి అబ్రహం, సిల్వారాజు పాల్గొన్నారు.

## సివిల్ డిపార్ట్‌మెంట్ సేవలు ప్రశంసనీయం


నాగెల్లి వెంకటేశ్వర్లు

మణుగూరు టౌన్, జూన్ 7 : కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపడంలో సివిల్ డిపార్ట్‌మెంట్ జట్టుగా పనిచేయడం స్ఫూర్తిదాయకమని ఏరియా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి వెంబడి చెట్లు కొమ్మలు విపరీతంగా పెరిగి వాహనదారుల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాయని, వాటిని తొలగించాలని సంబంధిత సివిల్ డిపార్ట్‌మెంట్ అధికారులను శనివారం ఆయన కోరారు. పద్మగూడెం గ్రామానికి అంతరాయాలు లేకుండా తాగునీటి సరఫరా చేయాలన్నారు.

## గోదావరిలో మునిగి బాలుడు మృతి

భద్రాచలం, జూన్ 7 : గోదావరిలో మునిగి బాలుడు మృతిచెందిన ఘటన శనివారం తెల్లవారుజామున భద్రాచలంలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన స్వప్న, ధనుంజయ్ కుటుంబంతోపాటు బంధువులు పుణ్యక్షేత్రాల సందర్శన నిమిత్తం విజయవాడ కనకదుర్గమ్మ దర్శనం అనంతరం భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకునేందుకు శనివారం వచ్చారు. తెల్లవారుజామున పవిత్ర గోదావరిలో స్నానం చేసేందుకు స్వప్న, ధనుంజయ్‌లు తన కుమారుడు అఖిల్(9), బంధువులతో కలిసి నదిలో దిగారు. స్నానం చేస్తున్న క్రమంలో ఒక్కసారిగా లోతు ఎక్కువగా ఉండటంతో అఖిల్ మునిగి గల్లంతయ్యాడు. దీంతో తల్లిదండ్రులతోపాటు బంధువులు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న గజ ఈతగాళ్లు బాలుడిని కాపాడేందుకు గోదావరిలో దూకారు. కాపాడే ప్రయత్నం చేసినా బాలుడు మృతిచెందడంతో అఖిల్ మృతదేహాన్ని గజ ఈతగాళ్లుకు ఒడ్డుకు తీసుకొచ్చారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ నాగరాజు సిబ్బందితో అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేశారు. బాలుడి మృతదేహం వద్ద తల్లితోపాటు కుటుంబసభ్యులు, బంధువులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళా ఎస్సైపై దాడిని ఖండిస్తున్నాం : సీపీఐ

సత్తుపల్లిటౌన్, జూన్ 7: కల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మహిళ ఎస్సైపై చేయి చేసుకొని దాడికి యత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. సత్తుపల్లిలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక మహిళ అని చూడకుండా ఎస్సైపై దాడి దుర్మార్గమైన చర్య అని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దోషులు ఎంతటి వారైనా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లయ్య

దమ్మపేట, జూన్ 7 : రైతుభరోసా పథకం కింద పెట్టుబడి నిధులను వెంటనే రైతులందరి ఖాతాలో జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొక్కెరపాటి పుల్లయ్య పేర్కొన్నారు. శనివారం దమ్మపేట మండల కేంద్రంలోని సుందరయ్యభవనంలో పార్టీ కమిటీ సభ్యుడు పిల్లి నాయుడు అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ వానకాలం సీజన్ ప్రారంభమైనందున విత్తనాలు, పురుగుమందులు, రసాయనిక ఎరువులు సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. పంటలకు సరైన మద్దతు ధర ప్రకటించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి, మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డా లక్ష్మీనారాయణ, కొప్పుల శ్రీనివాసరావు, పెనుబల్లి లక్ష్మణ్‌రావు, ఎం.నాగేశ్వరరావు, రమేష్, రఘు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం


బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఐటీడీఏ పీవో

కొత్తగూడెం టౌన్, జూన్ 7 : స్థానిక వేపలగడ్డలోని వివిన్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఐటీడీఏ పీవో రాహుల్, టీపీసీసీ మెంబర్ నాగ సీతారాములు పాల్గొని టాస్ వేసి ప్రారంభించారు. ఐటీడీఏ పీవో రాహుల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని క్రీడాకారులకు ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ రవికుమార్, జనరల్ సెక్రటరీ డాక్టర్ సావిత్రి, రమేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి


తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

అశ్వారావుపేట టౌన్, జూన్ 7 : ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కోరారు. నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నదని, విద్యార్థులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని చిన్నంశెట్టి బజార్‌లో బడిబాట ప్రోగ్రాంలో భాగంగా బడిబయట పిల్లలను గుర్తించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఎంఈవో ప్రసాదరావు పర్యవేక్షించారు. పలువురు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

చండ్రుగొండ, జూన్ 7 : చండ్రుగొండ ప్రధాన సెంటర్‌కు ఇరుపక్కలా అసంపూర్తిగా వదిలేసిన జూలూరుపాడు రోడ్డు డ్రైనేజీ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం మండల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం చండ్రుగొండ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మూడు కోట్లతో జరుగుతున్న డ్రైనేజీ పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. డ్రైనేజీ అసంపూర్తి వల్ల మురుగునీరు గ్రామంలో నిలిచి దుర్వాసన వస్తుందన్నారు. సమావేశంలో నాయకులు విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, రామడుగు వెంకటాచారి, మిరియాల మోహన్‌రావు, ఎస్కే నాగుల్‌మీరా, రాయిరాజా, భూపాల్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన


మాట్లాడుతున్న సీహెచ్ శ్రీకాంత్

ఇల్లెందు, జూన్ 7 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. శనివారం ఇల్లెందు మున్సిపాలిటీ పరిధి ఐదోవార్డులో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## బీమా చెక్కు అందజేత


బీమా చెక్కును అందిస్తున్న పోటు రంగారావు

బూర్గంపహాడ్, జూన్ 7 : సారపాక ఐటీసీ కర్మాగారంలో కార్మికుడిగా పనిచేసిన సొక్కా నాగేశ్వరరావు ఏప్రిల్ నెలలో 20వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. టీడీపీ సభ్యత్వం కలిగి ఉండటంతో హైదరాబాద్‌లో ఉన్న నాగేశ్వరరావు కుటుంబసభ్యులను టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుతో కలిసి శనివారం రూ.5 లక్షల బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి గల్లా నాగభూషయ్య, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## 43 పశువుల పట్టివేత


పశువుల వద్ద ఎస్సై సూర్యం, సిబ్బంది

ఇల్లెందు, జూన్ 7 : అక్రమంగా హైదరాబాద్‌కు 43 పశువులను తరలించే క్రమంలో ఇల్లెందు పోలీసులు పట్టుకున్నారు. ఇల్లెందు సీఐ బి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లెందు స్టేషన్ బస్తీలోని పాత పెంకు ఫ్యాక్టరీ నుంచి లారీలో గత రాత్రి అక్రమంగా పశువులను హైదరాబాద్‌కు తరలించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. నిందితులు ఐదుగురిపై కేసు నమోదు చేసి పశువులను పాల్వంచ గోశాలకు తరలించినట్లు సీఐ తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బూర్గంపహాడ్, జూన్ 7 : మండలంలోని సారపాక పరిధిలో నూతనంగా 33 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు, సబ్‌స్టేషన్‌లో ఫీడర్ల అత్యవసర మరమ్మతుల్లో భాగంగా సారపాక-1, సారపాక-2 ఫీడర్, సారపాక పరిధిలోని అన్ని కాలనీల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ గుర్రం ఉపేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తాగునీరు, ఇతర అవసరాలకు వినియోగించే నీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని కోరారు.

## యువకుడి మృతదేహం లభ్యం

బూర్గంపహాడ్, జూన్ 7 : మండల పరిధిలోని ఇరవెండి గ్రామానికి చెందిన యువకుడు గోదావరి నదిలో సరదాగా ఈతకు వెళ్లి గల్లంతు కాగా.. శనివారం మృతదేహం లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి. బి.స్రవంత్(24) సారపాక ఐటీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఓ స్నేహితుడితో కలిసి సరదాగా గోదావరిలో ఈత కొట్టేందుకు వెళ్లగా స్రవంత్ గల్లంతయ్యాడు. స్నేహితుడి ద్వారా సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు గాలింపు చర్యలు చేపట్టగా శనివారం మృతదేహం లభ్యమైంది.

## రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

పాల్వంచ రూరల్, జూన్ 7 : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని దంపతులకు తీవ్రగాయాలైన ఘటన మండలంలోని రంగాపురం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెంకు చెందిన ముసుము అశోక్‌రెడ్డి తన భార్య అఖిలతో కలిసి శుక్రవారం రాత్రి బూర్గంపాడు మండలం లక్ష్మీపురానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో పాల్వంచ వస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి అశోక్‌రెడ్డి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం కొత్తగూడెంలోని ఆసుపత్రికి తరలించారు. అశోక్‌రెడ్డి బాబాయి రామకోటిరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు బోడుగ్రామానికి చెందిన గడ్డం సంతోష్‌కుమార్‌పై శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.